క్లుప్తంగా

సీసీ కాలువల నిర్మాణం



గురవాంలో కొత్తగా నిర్మించిన సీసీ కాలువ

రాజాం: మండలంలోని గురవాం గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో సీసీ కాలువల నిర్మాణం చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లో మురుగుకాలువల అనుసంధానం చేస్తున్నామని, ప్రస్తుతం గ్రామపంచాయతీ అభివృద్ధి నిధులతో సీసీ కాలువలు నిర్మించినట్లు ఉపసర్పంచ్ ఆల్తి సత్యనారాయణ తెలిపారు.

నేత్ర శస్త్రచికిత్సకు 66 మంది ఎంపిక



వృద్ధురాలి కళ్లను పరీక్షిస్తున్న వైద్యుడు

వంగర: మండల కేంద్రంలో తిరుపతికి చెందిన నవజీవన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రజలతో పాటు పలు గ్రామాల నుంచి హాజరైన 155 మంది రోగులకు శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి పరీక్షలు చేశారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 66 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వారందరికీ ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు సమాచారం. కార్యక్రమంలో స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ, పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ సుష్మిత దయానా తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న పటువర్ధనం యువత

వంగర: మండలంలోని పటువర్ధనం గ్రామంలో నెలకొన్న లో–వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు గురువారం వెళ్లి, వినతిపత్రం అందజేశారు. లో–వోల్టేజీ కారణంగా ఫ్యాన్లు, తిరగడం లేదని, కొన్ని విద్యుత్ ఉపకరణాలు పాడవుతున్నాయని దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎం.తవిటినాయుడు, బంటు శ్రీను, వై.రాము తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ శ్యామసుందర్

బొబ్బిలి రూరల్: మండలంలోని కారాడ గ్రామంలో వరిపంటను ఆశించే తెగుళ్ల నివారణపై వ్యవసాయ శాఖ ఏడీ శ్యామసుందర్ గురువారం అవగాహన కల్పించారు. చిరుపొట్ట దశలో సోకే తెగుళ్లను తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నివారించుకోవచ్చని తెలిపారు. ఎకరా విస్తీర్ణంలోని పంటకు 30 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు. అలాగే పొట్టకుళ్లు తెగులు లేదా పొడ తెగులు రాకుండా ముందుగానీ వచ్చిన తర్వాత గానీ హెక్సాకొనాజోల్ అనే శిలీంధ్రనాశినిని ఎకరానికి 500 మిల్లీలీటర్లను నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ ఎం.సంతోషి, పి.లత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని మొగిలివలస సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ ఓజేసీఏ కుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. శ్రీకాకుళం రోడ్డులో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

నీటి సరఫరా నిలుపుదల..

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులకు శుక్రవారం నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నామని నగరపంచాయతీ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. తుపాను ప్రభావంతో పిడుగులు పడి, రేగిడి ప్రధాన పంపుహౌస్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిందని, టెక్నీషియన్‌ను పిలిచి సరిచేస్తున్నందున నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. మరమ్మతుల అనంతరం నీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

గ్రామాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం

- స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ఎంపీడీవోలు రామకృష్ణ, శ్యామలాకుమారి



తెర్లాం: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: గ్రామాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం రూపుదిద్దుకుంటుందని, ప్రతిఒక్కరూ ఆ దిశగా నడవాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంగన్నపాడు గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల పరిశుభ్రతకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడం జరుగుతోందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయించారు.

రేగిడి: గ్రామం పరిశుభ్రంగా ఉంటేనే గ్రామంలోని వారంతా ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో శ్యామలాకుమారి అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మునకలవలస, బాలకవివలస గ్రామాల్లో గ్రామాల పరిశుభ్రతపై గురువారం అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన గ్రామాల తయారీకి ప్రతిఒక్కరూ నడుంబిగించాలని ఆమె పిలుపునిచ్చారు. మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లోనూ ఈ కార్యక్రమం పక్కాగా నిర్వహించి, గ్రామాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ కడగల పద్మ, సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు తాతన్నాయుడు, పంచాయతీ కార్యదర్శి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: మునకలవలసలో స్వచ్ఛతా హి సేవా ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

యథేచ్ఛగా ఇసుక దోపిడీ



పోలీస్‌స్టేషన్ వద్ద పట్టుబడిన ఇసుక లోడు ట్రాక్టర్లు

బొబ్బిలి రూరల్: మండలంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. పట్టణ పరిధిలోని గ్రోత్ సెంటర్ సహా వేగావతి నదీ పరివాహక ప్రాంతాలైన పారాది, అలజంగి, కారాడ, పెంట గ్రామాల నుంచి ప్రతిరోజూ రాత్రిపూట ఇసుక రవాణా జోరుగా జరుగుతోంది. ఒక్క అలజంగి గ్రామ వీఆర్వో మాత్రమే ఇసుక అక్రమ రవాణాపై సమాచారం ఇస్తున్నారని, మిగతా గ్రామాల వీఆర్వోలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలజంగి గ్రామంలో 20 ట్రాక్టర్లు ఉండగా, ఒక్కో ట్రాక్టరుతో రెండు లోడుల ఇసుక తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరుతో నాలుగు టన్నుల ఇసుక తరలిపోతోంది. ఇలా ఒక్క అలజంగిలోనే రాత్రికి రాత్రి 40 లోడుల ఇసుక తరలిపోతోంది. పటిష్టమైనా నిఘా లేకపోవడం వల్లే ఇదంతా జరుగుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఇదివరకు తహసీల్దారు శ్రీను హెచ్చరించినా గురువారం సైతం పలు ట్రాక్టర్లు ఇసుకలోడుతో పట్టుబడడం ఇసుక అక్రమాలకు అద్దం పడుతోందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. నిఘా ఉంచితేనే ఇసుక తరలింపు జరగదని, లేకపోతే ఇష్టారాజ్యంగా అక్రమార్కులు రెచ్చిపోతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సిమెంట్ స్తంభాలు వేయండి



బొబ్బిలి పట్టణంలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి గురువారం పర్యటించి, ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇనుప విద్యుత్‌స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు వేయాలని ఆరో వార్డు ప్రజలు కోరారు. అక్కడి నుంచి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆమె.. పౌష్టికాహారం పంపిణీపై ఆరాతీశారు. లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అందివ్వాలని సూచించారు. అక్కడి నుంచి ఆంధ్రరత్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి, మధ్యాహ్న భోజన పథకం అమలుపై సమీక్షించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు వండిపెట్టాలని తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య సిబ్బంది

బాడంగి: గ్రామాల్లోని గ్రీన్ అంబాసిడర్లు(పారిశుధ్య సిబ్బంది)కు సంబంధించి, బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి సురేష్ సురేష్ కోరారు. ఇదే విషయమై ఆయన బాధిత పారిశుధ్య సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణను గురువారం కలిసి, వినతిపత్రం అందజేశారు. 6 నెలల నుంచి 18 నెలలుగా వారి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో వారంతా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

బొబ్బిలి రూరల్: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో పి.రవికుమార్ అన్నారు. పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాచ్చేరువలస గిరిజన గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. పీఎం జన్‌మన్ కార్యక్రమం కింద ఎంపికైన అన్ని గిరిజన గ్రామాల్లో సురక్షితమైన తాగునీరు, విద్య, వైద్యం, రోడ్లు వంటి సదుపాయాలను తప్పనిసరిగా కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం అక్కడి పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

నేడు 'గ్రామ సందర్శన'

బొబ్బిలి రూరల్: మండలంలోని కృష్ణాపురం, పెంట గ్రామాల్లో గ్రామ సందర్శన కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కృష్ణాపురంలో ప్లాంటేషన్ కార్యక్రమం అనంతరం మండల నోడల్ ఆఫీసర్ కె.మధుసూదనరావు పెంట గ్రామంలో పర్యటించనున్నారని, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

నీటి స్వచ్ఛత పరీక్ష తప్పనిసరి



నీటి స్వచ్ఛత పరీక్ష చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీరామ్, ఏఎన్ఎం ప్రశాంతి

తెర్లాం: నీటి స్వచ్ఛత పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలని తెర్లాం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీరామ్, ఏఎన్ఎం ప్రశాంతి సూచించారు. స్థానిక సచివాలయం-2 వద్ద నీటి స్వచ్ఛత పరీక్షలు గురువారం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లోని తాగునీటి వనరులు, ఇళ్ల వద్ద ఉన్న బోర్లు నుంచి తాగునీటిగా వినియోగిస్తున్న నీరు సురక్షితమైనదో కాదో తెలుసుకోవాలంటే తప్పనిసరిగా నీటి పరీక్ష చేయించాలన్నారు. గ్రామ సచివాలయాల్లోనే ఈ పరీక్షలు చేయడం జరుగుతోందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కాచిచల్లార్చిన నీటినే తాగాలని తెలిపారు.

మెడికల్ సీట్లు వద్దని లేఖ రాయడం దుర్మార్గం



మాట్లాడుతున్న లక్ష్మునాయుడు

బొబ్బిలి: కడప జిల్లా, పులివెందులలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు ఎన్ఎంసీ(జాతీయ వైద్య కమిషన్) మంజూరు చేసిన 50 సీట్లు వద్దని చంద్రబాబు ప్రభుత్వం లేఖ రాయడం దుర్మార్గమని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు మండిపడ్డారు. ఇదే విషయమై గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను దగ్గర చేయాలన్న లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. గతేడాది అందులో ఐదు వైద్య కళాశాలలు ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైద్యారోగ్య రంగాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుండడం విచారకరమన్నారు. పొరుగురాష్ట్రంలో శాశ్వత భవనాలు లేకపోయినా తాత్కాలిక భవనాల్లో 400 సీట్లతో కళాశాలలు నడిపిస్తున్నారని, అటువంటి చర్యలు కూడా టీడీపీ ప్రభుత్వం చేపట్టేందుకు ముందుకు రాకపోవడం విద్యార్థులను మోసం చేయడమేనన్నారు. ఇప్పటికైనా ప్రజావ్యతిరేక విధానాలు, కార్యక్రమాలు మానుకోవాలని హితవుపలికారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం

బొబ్బిలి: పట్టణంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే బేబీనాయన గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్ తదితరులు పాల్గొన్నారు.

లంబోదరుడికి ప్రత్యేక పూజలు

వంగర: మండలంలోని కొట్టిశ గ్రామంలో మండపం వద్ద కొలువైన వినాయకుడికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ ఈ పూజల్లో పాల్గొని, ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని వేడుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం నిమజ్జనోత్సవం నిర్వహించారు.

పాడిరైతుల ఆందోళన

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామ పశువైద్య శాలలో వైద్యసేవలు సకాలంలో అందకపోవడంతో పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరుకాకపోవడంతో పాటు గ్రామంలోని వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండడంతోనే తమకు ఈ దుస్థితి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏం చేయాలో తెలియక బొబ్బిలి మండల కేంద్రానికి మరీ వెళ్ల, తమ పశువులకు చికిత్స చేయించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనిపై పశుసంవర్ధక శాఖ ఏడీ విష్ణును వివరణ కోరగా, గ్రామంలోని రెండు సచివాలయాల్లోనూ వెటర్నరీ అసిస్టెంట్లు లేరని, ఆస్పత్రి అసిస్టెంట్ ఒక్కరే వైద్యం అందించడం భారంగా మారిందన్నారు. సమయపాలన పాటించేలా సిబ్బందికి సూచనలిస్తామని తెలిపారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. మోదుగువలస గ్రామంలో కాలువల్లోని పూడికలు గురువారం తొలగించారు. చెత్తాచెదారం కాలువల్లో వేయొద్దని, ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ సూచించారు.

రాజాం: పట్టణంలోని నరసింహనాయుడు, సారధి తదితర వార్డుల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ పర్యవేక్షణలో మురుగుకాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి, డంపింగ్‌యార్డుకు తరలించారు.

రేగిడి: పారిశుధ్య చర్యల్లో భాగంగా మండలంలోని సంకిలి, బొడ్డవలస గ్రామాల్లో మురుగుకాలువలు, తాగునీటి వనరుల వద్ద బ్లీచింగ్ చల్లారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ పట్టాభి తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!



తెర్లాం: పెరుమాళి ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో త్రినాధరావు



రాజాం సిటీ: పాగిరిలో హోరాహోరీగా కబడ్డీ పోటీ



తెర్లాం: కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలు చాలా ఉల్లాసంగా ఉత్సాహంగా జరుగుతున్నాయి. అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చదరంగం, యోగా, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని, తమ సత్తా చాటుతున్నారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



తెర్లాం: పెరుమాళిలో వాలీబాల్ పోటీలు



వంగర: అరసాడ ఉన్నత పాఠశాల మైదానంలో ఆటల పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచ్ జగదీశ్వరి

–తెర్లాం, వంగర, రాజాం సిటీ

సీహెచ్‌సీలో మందుల కొరత



గాయపడిన బాలిక తల్లిదండ్రులతో సీఐటీయూ నేత సురేష్

బాడంగి: స్థానిక సీహెచ్‌సీలో మందుల కొరత నెలకొందని, దీంతో చాలామంది రోగులు ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ మండల కార్యదర్శి ఎ.సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన ఓ చిన్నారి వైద్యసేవల నిమిత్తం గురువారం ఆస్పత్రికి వస్తే, చికిత్స అనంతరం మందుల చీటీ రాసి ఇచ్చారన్నారు. ఆ మందుల చీటీలో మొత్తం మూడు రకాల మందులు ఉండగా, ఒక్క మందు తప్ప మిగిలిన రెండు మందులు లేవని, బయట కొనుక్కోవాలని సిబ్బంది చెప్పినట్లు బాధితుల ద్వారా తెలిసిందన్నారు. ఇదిలా ఉంటే ఆస్పత్రి సిబ్బందిలో కొంతమంది సాయంత్రం విధులు ముగించుకుని వెళ్లేటప్పుడు తమకు అవసరమైన మందులు వెంట తీసుకుపోతున్నారన్న సమాచారం కూడా తమ వద్ద ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

మహిళా సంఘాల బలోపేతానికి చర్యలు



మాట్లాడుతున్న వెలుగు కో-ఆర్డినేటర్ చిరంజీవి

వంగర: మహిళా సంఘాల బలోపేతానికి చర్యలు చేపట్టాలని వెలుగు శాఖ రాజాం ఏరియా కో–ఆర్డినేటర్ ఎ.చిరంజీవి సూచించారు. మండలంలోని పలు గ్రామాల వీవోఏలతో జూమ్ మీటింగ్ ద్వారా గురువారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామాల వారీగా సెర్ప్ కార్యక్రమాల అమలు, సంఘ సభ్యులకు అందించే స్త్రీనిధి, హెచ్‌డీఐఎఫ్, ఉన్నత రుణాలు రికవరీలపై సమీక్షించారు. అనంతరం వెలుగు కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై, సీసీలంతా క్లస్టర్‌లలో పర్యటించి, మహిళలకు అందుతున్న రుణాలపై ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో సమాచారం నమోదు చేయాలన్నారు. రుణాల మంజూరు, రుణాల రికవరీపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు ఎం.చక్రపాణి, టి.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



ఎమ్మెల్యేకు నగదు, బియ్యం అప్పగిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, మెప్మా సిబ్బంది

బొబ్బిలి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక మున్సిపల్ కార్యాలయ మెప్మా సిబ్బందిలోని రిసోర్స్‌పర్సన్‌లు రూ.9 వేల నగదుతో పాటు 5 టన్నుల బియ్యాన్ని విరాళంగా అందజేశారు. స్థానిక పట్టణంలో వీటిని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చేతుల మీదుగా ఎమ్మెల్యే బేబీనాయనకు గురువారం అందించారు. బాధితులకు త్వరగా అందేలా చూడాలని కోరారు. బియ్యం దానం అందరికీ ధన్యవాదాలన్నారు. కార్యక్రమంలో టీపీఆర్వో జగన్‌మోహనరావు, మెప్మా సీఎం ఎం రాము, ఆర్పీలు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి



ప్రార్థనా సమయానికి విద్యార్థుల హాజరు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని తోకలవలస, లక్ష్మణవలస, తాటిపాడు తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. రికార్డుల పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, సమయపాలనపై ఆరాతీశారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, లెస్సన్ ప్లాన్ ఆధారంగా బోధిస్తే సమర్థవంతంగా ఉంటుందన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వండిపెట్టేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఈకేవైసీ చేసుకోవాలి

బాడంగి: పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో కె.శిరీష తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఆమె గురువారం మాట్లాడుతూ మండలంలో మొత్తం 15,100 ఎకరాల్లో పంటలు పండిస్తుండగా, వాటిలో 14,500 ఎకరాల్లోని పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. మండల వ్యాప్తంగా 95 శాతం మేర ఈ–క్రాప్ నమోదు, 55 శాతం మేర ఈకేవైసీ నమోదు పూర్తి చేయడం జరిగిందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్)లు అందుబాటులో ఉంటారని, వారి వద్దకు వెళ్లి, ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు.

సన్మానం

వంగర: మండలంలోని కొప్పర గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఎం.హరినారాయణ, రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయుడు మర్రాపు అప్పలస్వామిలను స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ స్కూల్ యాజమాన్యం గురువారం సన్మానించారు. ఇరువురు ఉపాధ్యాయులు ఎంతోమంది విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దారని ప్రిన్సిపాల్ బి.ఈశ్వరరావు, డైరెక్టర్ కె.పారినాయుడు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సన్మాన గ్రహీతలు ఆకాంక్షించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

వంగర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో వై.దుర్గారావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డుల నిర్వహణను పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు చూసి, మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. రుచి, శుచి కలిగిన భోజనం విద్యార్థులకు వండిపెట్టాలని, ఆ దిశగా వంట నిర్వాహకులకు సూచించారు. ఎఫ్ఏ-1 మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై.రామకృష్ణ, ఉపాధ్యాయుడు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న గణనాథులు

బొబ్బిలి: పట్టణంలోని చీపురుపల్లి వీధిలో హిందూ ఉత్సవ సమితి చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల రూపాల్లో మండపంలో కొలువైన గణనాథుడి విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వినాయక చవితి పండగ సందర్భంగా ముంబై నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి, తీసుకువచ్చిన ఈ ప్రతిమలను ఈ నెల 23వ తేదీన నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 21వ తేదీన మహాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రేగిడి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నూకాలమ్మ, శశికళ, బంగారమ్మ, అమ్మన్నమ్మలు అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని బూరాడ, రేగిడి, సంకిలి, ఉనుకూరు సెక్టార్ల అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు.. ప్రతిరోజూ మనం తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

నేటినుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు వి.రాజేశ్వరి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో జరిగే ఈ పోటీల్లో మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన వారు పాల్గొంటారన్నారు.

మొక్కల పెంపకం పరిశీలన

బాడంగి: ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరు చేసిన పండ్లతోటల మొక్కల పెంపకాన్ని మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆకులకట్ట, ముగడ గ్రామాల్లో రాజాం క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. స్థానిక గురుకుల పాఠశాల వద్ద నాటిన మొక్కలను ప్రిన్సిపాల్ రామ్‌దాస్ పరిశీలించి, మొక్కల పెంపకం బాధ్యతలను విద్యార్థులకు అప్పగించారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కల పెంపకానికి ముందుకురావాలని కోరారు.

మద్యంసీసాలు స్వాధీనం

వంగర: మండలంలోని అరసాడ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి దగ్గర నుంచి 10 మద్యంసీసాలు గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. అనంతరం ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.